
ఆంధ్రజ్యోతి



శ్రీశైలం జలాశయానికి పెరిగిన ఇన్‌ఫ్లో

శ్రీశైలం, ఆగస్టు 21: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 60,202 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 92,652 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,24,112 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 882.50 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుతం 201.5822 టీఎంసీలుగా నమోదైంది.

దుర్దశలో సిద్ధాపురం

- తరచూ అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ సమస్య
- మరమ్మతుల కోసం తెలుగుగంగ అధికారుల తంటాలు
- నిధులు కేటాయించని గత వైసీపీ ప్రభుత్వం
- వెలుగోడు జలాశయానికి కొనసాగుతున్న వరద
- అయినా ఎత్తిపోతలకు అవాంతరం

ఆత్మకూరు, ఆగస్టు 21

ఆత్మకూరు మండలానికి సిద్ధాపురం ప్రాజెక్ట్ ఎంతో కీలకం. శ్రీశైలం నియోజకవర్గానికి కేంద్ర బిందువైన ఆత్మకూరు మండలం సమీపంలోనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నా.. ఇక్కడి బీడు భూములకు సాగునీటి సదుపాయం లేదు. వర్షాధార పొలాలకు సిద్ధాపురం ఒక్కటే ఆధారం. దశాబ్దాలపాటు రైతాంగం చేసిన పోరాటం ఫలించి 2006 ఏప్రిల్ 20న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ రూ.116.52 కోట్ల ఖర్చుతో ప్రతిష్టాత్మకంగా ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిచేసింది. 2018 జనవరి 7వ తేదిన సీఎం చంద్రబాబు జాతికి అంకితం చేశారు. అదే రోజు ప్రాజెక్ట్ అభివృద్ధికి మరిన్ని ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అయితే 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్వహణను గాలికి వదిలేసింది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వమైనా ఈ సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని 21,300 ఎకరాలకు సాగునీరందించి ఆయకట్టును స్థిరీకరించేలా రూపొందించారు. ఇందులో ఆత్మకూరు మండలంలో 17,950 ఎకరాలు, పాములపాడు మండలంలో 3,350 ఎకరాల ఆయకట్టును నిర్దేశించారు. ప్రధానంగా వెలుగోడు జలాశయంలో 5.6 టీఎంసీలకు నీటినిల్వలకు తగ్గకుండా ఉన్నప్పుడే వీబీఆర్ నుంచి సిద్ధాపురం చెరువులోకి 200 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేలా ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా స్టేజ్-1 పంప్ హౌస్ నిర్మాణం చేపట్టి అక్కడి నుంచి రెండు భారీ మోటార్ల ద్వారా (ఒక్కో మోటారు 100 క్యూసెక్కుల సామర్థ్యం) నీటిని 40 అడుగుల ఎత్తులో నిర్మించిన సర్జ్ ట్యాంక్‌లోకి ఎక్కిస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ మీదుగా 6.750 కిమీల దూరం అండర్‌గ్రౌండ్ పైపులైన్ ద్వారా ప్రవహించి స్టేజ్-2 పంప్‌హౌస్‌లోకి చేరుతాయి. అక్కడ వున్న మరో రెండు భారీ మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయడంతో 0.975 కిమీల దూరంలో వున్న చెరువులోకి వీబీఆర్ జలాలు చేరుకునేలా ప్రాజెక్ట్‌ను నిర్మించారు. కాగా రెండు పంప్‌హౌస్‌లకు విద్యుత్‌సరఫరా అందించేందుకు అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ ద్వారా విద్యుత్‌తీగలను ఏర్పాటు చేసి 33/11 రెండు పవర్‌స్టేషన్‌లను నెలకొల్పారు. వీటికి ఆత్మకూరు 132/33 విద్యుత్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది.

తరచూ అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ సమస్య

సిద్ధాపురం ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లో ప్రధానమైన అంశం పంప్‌హౌస్‌లకు విద్యుత్ సరఫరా చేయడమే. ప్రాజెక్ట్ పరిధిలోని రెండు పంప్ హౌస్‌లు నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో ఉండటంతో ఆయా పంప్ హౌస్‌ల వద్ద విద్యుత్ స్తంభాల ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు అటవీ అధికారులు అభ్యంతరాలు తెలిపారు. దీంతో చేసేది ఏమీలేక అప్పట్లో సంజీవనగర్ తండా గ్రామం నుంచి స్టేజ్-1, స్టేజ్-2 పంప్ హౌస్‌ల వరకు 33కేవీ సామర్థ్యం గల అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్‌ను దాదాపు 12కిమీల పొడవుతో భూమిలోనే తీసుకెళ్లారు. ఈ క్రమంలో అనేక చోట్ల పవర్ కేబుల్‌కు జాయింట్లు వేయాల్సి వచ్చింది. అయితే వర్షాల కారణంగా ప్రతిఏటా అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ మరమ్మతులకు గురై



స్టేజ్-1 వద్ద ఏర్పాటు చేసిన 33/11కేవీ సబ్‌స్టేషన్

పంప్ హౌస్‌లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వెలుగోడు జలాశయం నుంచి సిద్ధాపురం చెరువుకు కృష్ణాజలాల ఎత్తిపోయడం సమస్యగా మారింది. ఈ సమస్య తెలుగుగంగ పథకం అధికారులు తలనొప్పిగా మారుతోంది.

సవాల్‌గా మారిన సమస్య పరిష్కారం

సాధారణంగా అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్‌ను ఎక్కడైనా అవసరాల నిమిత్తం 100 మీటర్లు నుంచి 300 మీటర్లు వేస్తారు. ప్రత్యేకించి రోడ్ల క్రాసింగ్ వద్ద ఈ విధానాన్ని ఎంచుకుంటారు. అయితే ఏకంగా 12 కిమీల పొడవునా అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్‌ను ఏర్పాటు చేయడమంటే మామూలు విషయం కాదు. అనేక చోట్ల కేబుల్‌కు జాయింట్లు వేయాల్సి ఉంటుంది. వర్షాలు కురిస్తే భూమిలోని కేబుల్ జాయింట్ల నుంచి నీరు కేబుల్‌లోకి ప్రవేశించడంతో దెబ్బతినే అవకాశం ఉంటుంది. అయితే దెబ్బతిన్న పవర్ కేబుల్‌ను బాగు చేయడం కూడా అంత సులభమేమీ కాదు. తొలుత ఎక్కడ దెబ్బతిన్నదో లోకేషన్ గుర్తించడం చాలా కష్టం. ఈ వర్క్ చేసేవాళ్లు కూడా దేశంలోనే అరుదుగా ఉన్నారు. ఎప్పుడైనా ఈ సమస్య వాటిల్లితే హైదరాబాద్‌లోని విజయ్ ఎలక్ట్రికల్ సంస్థ వాళ్లు వచ్చి సమస్యను పరిష్కరించేవారు. ఇటీవల వారు మరమ్మతు చేసేందుకు సిద్ధాపురం చెరువు కట్ట వద్దకు రాగా లోకేషన్ గుర్తించే యంత్రం దెబ్బతింది. ఈ యంత్ర పరికరాలు జర్మనీ నుంచి తీసుకురావాలని తెలిసింది. ప్రత్యామ్నాయంగా కలకత్తాలోని మరో సంస్థను తెలుగుగంగ అధికారులు సంప్రదించగా ఒక్కో జాయింట్‌కు రూ.2లక్షల నుంచి 3లక్షలు ఇవ్వాలని కొటేషన్ వేసినట్లు సమాచారం. పైగా కలకత్తా నుంచి ఇక్కడికి యంత్రాన్ని తీసుకొచ్చేందుకు అన్ని చార్జీలు భరాయించాలని చెప్పడంతో తెలుగుగంగ అధికారులు నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. మొత్తానికి ఈ సమస్యను పరిష్కరించడం తెలుగుగంగ అధికారులకు పెను సవాలేనని చెప్పవచ్చు.



సిద్ధాపురం చెరువులో అడుగంటిన జలాలు

నిధుల్లేక అవస్థలు

సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించలేదు. ప్రస్తుతం అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ మరమ్మతులకు ఎంత ఖర్చు అయ్యేది కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్య పరిష్కారానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని తెలుగుగంగ అధికారులు ఇటీవల కలెక్టర్‌ను కోరినట్లు తెలిసింది. అయితే మైనింగ్ శాఖ నుంచి రూ.5 లక్షల మంజూరుకు కలెక్టర్ ఆమోదం తెలిపినప్పటికీ తక్షణమే చెల్లింపునకు నిధులు అందుబాటులో లేనట్లు సమాచారం. అయితే సదరు ఎలక్ట్రికల్ సంస్థ వారు మాత్రం తమకు బిల్లులు ఇస్తేనే వర్క్ చేస్తామని చెబుతున్నట్లు తెలిసింది. దీంతో ఈ నిధులను ఏ విధంగా సమకూర్చాలో తెలియక తెలుగుగంగ అధికారులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. కాగా ఇటీవల చెరువుకట్టపై జంగిల్ పెరగడంతో తొలగించేందుకు కూడా నిధులు లేకపోవడంతో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చొరవతో జంగిల్ తొలగింపు పనులు చేపట్టారు.



సిద్ధాపురం చెరువు మట్టికట్ట దుస్థితి ఇలా

పక్కనే కృష్ణాజలాలు.. అయినా ఎత్తిపోతలకు అవాంతరం

ఏడాది ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలతో శ్రీశైల జలాశయానికి వరద నీరు సమృద్ధిగా చేరింది. జూలై 28వ తేదీన పోతిరెడ్డిపాడు నుంచి బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ మీదుగా వెలుగోడు జలాశయానికి వరదజలాలు వచ్చి చేరారు. వెలుగోడు జలాశయం గరిష్ఠ సామర్థ్యం 16.95 టీఎంసీలకు గాను ప్రస్తుతం 14.5టీఎంసీల మేర నీటినిల్వలు ఉన్నాయి. ఇక్కడి నుంచి చెన్నై ప్రధాన కాల్వ ద్వారా తమిళనాడుకు కృష్ణాజలాలు తరలుతున్నా పక్కనే ఉన్న సిద్ధాపురం చెరువుకు నీరు ఎత్తిపోయలేని పరిస్థితి నెలకొంది. సకాలంలో సిద్ధాపురం చెరువులోకి నీటినిల్వలు చేర్చుకోకపోతే ప్రస్తుత ఖరీఫ్‌తో పాటు రాబోయే రబీ సీజన్‌లో కూడా ఆయకట్టుకు నీటికష్టాలు తప్పవని చెప్పవచ్చు. పైగా సిద్ధాపురం చెరువులో పుష్కలంగా నీరు ఉన్నట్లయితే ఆత్మకూరు పట్టణంలో తాగునీటి సమస్య వాటిల్లదు. ఏది ఏమైనా.. వరదజలాల ప్రవాహ సమయంలోనే సిద్ధాపురం చెరువులోకి నీరు విడుదల చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు.



నీటిని పంపింగ్ చేసే మోటారు

వైసీపీ పాలనలో నిర్వీర్యమైన సిద్ధాపురం ప్రాజెక్ట్

ఐదేళ్ల వైసీపీ పాలనలో సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రాజెక్ట్ నిర్వహణను ఏమాత్రం పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రాజెక్ట్‌కు దాదాపు రూ.74.75 కోట్ల పెండింగ్ బిల్లులను చెల్లించాల్సి ఉంది. ఇందులో విద్యుత్ బకాయిలే రూ.63 కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా ప్రాజెక్ట్ కాంట్రాక్టర్‌కు సుమారు మరో రూ.11కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. దీని వల్ల ఈ పథకం పనితీరు అధ్వానంగా మారింది. తూము గేటు మరమ్మతులకు గురవ్వడంతో పాటు మట్టికట్ట బలహీనపడి రంధ్రాలు పడ్డాయి. అదేవిధంగా మట్టికట్టపై జంగిల్ పెరిగి ప్రమాదకరంగా మారింది. ప్రాజెక్ట్ నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేయడంతో పాటు సుమారు రూ.74.75 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇందులో సుమారు రూ. 63 కోట్లు విద్యుత్ బకాయిలే ఉన్నాయి. కాగా సిద్ధాపురం చెరువు నుంచి వెంకటాపురం, కృష్ణాపురం అమలాపురం, శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం గ్రామాల్లోని సుమారు 4500 ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరందించాల్సిన ప్రతిపాదనలు ఏమాత్రం ముందుకు సాగలేదు.



అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, ఆగస్టు 21: నంద్యాల సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని బుధవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎస్పీ ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించిన రికార్డులు, పోక్సో కేసులకు సంబంధించిన రికార్డులు, తీవ్రమైన నేరాలు (జీసీఆర్)కు సంబంధించిన రికార్డులు, జనరల్ డైరీ, సబ్ డివిజన్‌కు సంబంధించిన క్రైమ్ రిజిస్టర్లు, ఎస్‌హెచ్‌ఆర్‌సీ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ (పీజీఆర్‌ఎస్) తదితర రికార్డులను పరిశీలించారు. మట్కా, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఉంచాలని, అసాంఘిక కార్యక్రమాలకు సంబంధించి ప్రజలను పోలీస్‌శాఖకు సమాచారం ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రిళ్లు అనవసరంగా బయట తిరిగేవారిపై చర్యలు తీసుకోవాలని, అనుమానిత వ్యక్తుల వేలిముద్రలు సేకరించాలని పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్ నిత్యం నిర్వహించాలన్నారు. సబ్ డివిజన్‌లోని అన్ని గ్రామాలు, కాలనీలను పోలీస్ అధికారులు సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీసీ నాగరాజు ఉన్నారు.

వ్యవస్థలను భ్రష్టు పట్టించిన వైసీపీ

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 21: గత వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీ నిర్వహణ భ్రష్టు పట్టిపోయిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. ఇప్పుడు అన్నింటినీ బాగుపరుస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. బనగానపల్లె పట్టణంలోని విద్యుత్ కార్యాలయం సమీపంలో రోడ్లు, డ్రైనేజీ నిర్వహణపై బుధవారం మంత్రి నేరుగా వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ రోడ్లు, డ్రైనేజీ నిర్వహణలో అధికారుల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు గత వైసీపీ పాలనలో గుంతల రోడ్లు, రోడ్లపై పారే డ్రైనేజీ వ్యవస్థతో అనేక ఇబ్బందులు పడ్డారని అధికారులకు గుర్తు చేశారు. బనగానపల్లెలో గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కాటసాని రామిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి బనగానపల్లెకు వస్తున్నాడంటూ హడావుడిగా నాణ్యతలేని రోడ్లు వేశారని విమర్శించారు. ఈరోడ్లు చిన్నపాటి వర్షానికే కొట్టుకుపోయి పెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. గత పాలకులు చేసిన తప్పులను ఈ ప్రజాప్రభుత్వంలో అధికారులు తగిన శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తక్షణమే రోడ్లకు మరమత్తులు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇకపై తాను నిత్యం ఆకస్మిక తనిఖీలు చేస్తుంటానని, అధికారులు ప్రజాసేవపై దృష్టిపెట్టి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఆండ్‌బీ జిల్లా ఇంజనీరింగ్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఏఈ హుసేన్, పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ఏఈ మహేశ్, టీడీపీ నాయకులు వంగల పరమేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, దొనపాటి భాస్కర్‌రెడ్డి, టంగుటూరు శీనయ్య, శ్రీనివాసరెడ్డి, మహేశ్వరరెడ్డి, మద్దిలేటిరెడ్డి, దివాకర్‌రెడ్డి, అహమ్మద్‌హుస్సేన్, షబ్బీర్, గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకటరామిరెడ్డి, జనసేన భాస్కర్, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో డ్రైనేజీ వ్యవస్థను తనిఖీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఇంద్రధనుస్సు కనువిందు

మబ్బులు కమ్మిన ఆకాశంలో ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. బుధవారం మధ్యాహ్నం ప్యాపిలి మండల కేంద్రంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఒక వైపు ఎండ మండిస్తుండగా మరో వైపు చినుకులు కురుస్తుండగా రంగు రంగుల ఇంద్ర ధనుస్సు ఆకాశంలో దర్శనమివ్వడం చూపరులను కట్టిపడేసింది. ప్యాపిలిని చుట్టేసినట్లు ఉన్న ఈ సప్తవర్ణశోభిత దృశ్యాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. మరికొందరు ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.

\- ప్యాపిలి



శ్రీశైలంలో భారీ వర్షం

- ఘాట్ రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలు
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

శ్రీశైలం, ఆగస్టు 21: శ్రీశైలంలో మంగళవారం అర్ధరాత్రి తర్వాత భారీ వర్షం కురిసింది. బుధవారం తెల్లవారుజాము వరకు కుండపోతగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. శ్రీశైలం జలాశయం ఘాట్ రోడ్డులో భారీ వర్షానికి కొండ చరియలు విరిగిపడ్డాయి. కుడిగట్టు విద్యుత్ కేంద్రం పైభాగంలోని ఘాట్ రోడ్డులో పెద్ద బండరాళ్లు రోడ్డుమీదకు వచ్చిపడ్డాయి. దీంతో తెలంగాణ ప్రాంతం నుంచి శ్రీశైలానికి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉంటే భారీ వర్షం కారణంగా జలాశయానికి వెళ్లే రోడ్డు, శ్రీశైలం ఘాట్ రోడ్డు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. శ్రీశైలంలో 135.3 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. భారీ వర్షానికి క్షేత్ర పరిధిలోని పలు వీధులు జలమయమయ్యాయి. క్షేత్ర పరిధిలోని ఆలయ మాఢ వీధులు, లలితాంబికా షాపింగ్ కాంప్లెక్స్, ఎస్సీ కాలనీ, కొత్తపేట, శ్రీగిరి కాలనీ, క్షేత్ర వీధుల్లో వర్షపు నీరు వచ్చి చేరింది. కొత్తపేటలోని పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇళ్లలోకి నాలుగు అడుగులమేర నీరు చేరి భారీగా ఆస్తి నష్టం సంభవించింది. పాతాళగంగ మెట్ల మార్గంలో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. బుధవారం ఆలయ ఈఓ డి.పెద్దిరాజు క్షేత్ర పర్యటన చేసి వర్షంతో దెబ్బతిన్న ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవస్థానం పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో దేవస్థానం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్ర పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మ్యాన్ హోల్స్ వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తక్షణమే ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు దేవస్థానం అన్నదాన భవనం నుంచి భోజన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇళ్లలోకి నీరు చేరిన వారు ఆలయ వసతిగృహాల్లో ఉండేలా చర్యలు తీసుకున్నారు. నీట మునిగిన ప్రాంతాలను తహసీల్దార్ మల్లికార్జునరావు పరిశీలించారు. నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ, బీజేపీ నాయకులు తహసీల్దార్‌ను కోరారు.



ఘాట్‌రోడ్డులో రోడ్డుపై పడ్డ బండరాళ్లు



శ్రీశైలంలోని కొత్తపేటలో ఇళ్లను చుట్టుముట్టిన వర్షపు నీరు



శ్రీశైల ఆలయ వీధిలో ధ్వంసమైన రహదారి

విద్యుదాఘాతంతో రైతు, ఎద్దు మృతి

వెల్దుర్తి, ఆగస్టు, 21: విద్యుదాఘాతంతో ఓ రైతు, అతని ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలో గోవర్ధనగిరి గ్రామంలో బుధవారం జరిగింది. రైతు మద్దిలేటి (63) బుధవారం తెల్లవారు జామున 4:30 గంటల సమయంలో టాయిలెట్‌కు వెళ్లడానికి లేచాడు. ఎద్దు కిందపడిపోయి ఉండడాన్ని గమనించిన రైతు ఎద్దును లేపడానికి వెళ్లి పగ్గం పట్టుకోగా విద్యుత్‌షాక్ తగిలి పక్కనే ఉన్న ఫెన్సింగ్‌పై కుప్పకూలాడు. పశువుల దొడ్డి పక్కన ఆనుకొని ఉన్న కంచె మీద విద్యుత్ ప్రసరిస్తున్న కరెంట్ తీగ తెగిపడడంతో ఎద్దు, రైతు చనిపోయారు. విద్యుత్ అధికారులు స్తంభం వద్ద తీగ కత్తిరించకుండా, ఇంటి మీటరు వద్ద తీగ కత్తిరించడంతో గాలులకు కరెంట్ తీగ కంచె మీద పడటంతో ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వరద ప్రభావిత పంటలను పరిశీలించిన జేసీ

దేవనకొండ, ఆగస్టు 21 : హంద్రీకి వరద పోటెత్తడంతో నీట మునిగిన పంటపొలాలను జాయింట్ కలెక్టర్ నవ్య పరిశీలించారు. మండలంలోని తెర్నేకల్, పొట్లపాడు, అలారుదిన్నె గ్రామాలలో బుధవారం జేసీ పర్యటించారు. వరదలో పంటను నష్టపోయిన రైతులను కలుసుకొని, వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతికి మిరప, టమోట, ఉల్లి, పత్తి, కంది, వేరుశనగ తదితర పంటలు రైతులు నష్టపోయారని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి జేసీకి వివరించారు. వరద ప్రవాహంతో పంటలు నష్టపోవడానికి కారణం విశాలంగా వుండాల్సిన హంద్రీ నదిలో పూడిక విపరీతంగా పేరుకుపోయి, ఏపుగా చెట్లు పెరగడంతోనేనని తెర్నేకల్ గ్రామస్తులు జేసీ దృష్టికి తీసికెళ్లారు. తహసీల్దార్ జయ్యన్న, ఏడీఏ మోహన్ విజయ్, ఏఈవో జయరాం, తెర్నేకల్ సర్పంచు అరుణ్‌కుమార్ వీఆర్వో దాదావలి, పంచాయతీ కార్యదర్శి రాముడు, సలీం తదితరులు ఉన్నారు.

9 లోగా దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 21: హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2025 సంబంధించి హజ్ యాత్ర కోసం వెళ్లేవారు సెప్టెంబరు 9వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డా. సునీల్ కన్నా బుధవరం ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2024 నుంచి ప్రత్యేక హజ్ సువిధ యాప్‌ను ప్రారంభించింది. దరఖాస్తుదారులు హజ్ కమిటీ సైట్ www.hajcommittee.gov.in/, www.apstatehajcommittee.com ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏపీ రాష్ట్ర హజ్‌కమిటీ ద్వారా సహాయాన్ని వ్యక్తిగతంగా లేదా టోల్ ఫ్రీ లేదా 1800-4257873, 0866-2471786 లేదా మెయిల్ aphajcommittee@gmail.com ద్వారా పొందచ్చునన్నారు.

అనధికార లే అవుట్లకు నోటీసులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 21: నగర పాలక సంస్థ పరిధిలో అనధికారికంగా వేసి లేఅవుట్లకు నోటీసులు జారీ చేస్తూ కమిషనర్ పివి. రామలింగేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనధికార లేవుట్లు, ప్లాట్లలో ప్రజలు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కొనుగోలు చేయరాదని ఆయన సూచించారు. నగర పాలక పరిధిలో మొత్తం 35 అనధికారి లే అవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశారన్నారు. ఇలాంటి వాటిలో స్థలం, ప్లాట్లు కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమని, భవిష్యత్తులో అమ్మకానికి, కొనుగోలుకు వీలు ఉండదని ఆయన పేర్కొన్నారు. అనధికారి లేఅవుట్లలో మౌలిక వసతులు నగర పాలక సంస్థ చేపట్టబోదని ఆయన స్పష్టం చేశారు.

ఉర్దూ వర్సిటీలో ఎంసీఏ కోర్సు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 21: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఎంసీఏ కోర్సు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని రిజిస్ట్రార్ లోకనాథ్ తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్న ఎంసీఏ కోర్సులో 30 సీట్లు మంజూరు అయ్యాయన్నారు. ఏపీ ఐసెట్ 2024 ద్వారా రెండో విడత కౌన్సెలింగ్‌లో ఎంసీఏ కోర్సులో చేరే విద్యార్థులు యూనివర్సిటీ కోడ్ ఏహెచ్‌యూయూను ఎంపిక చేసుకుని ఆప్షన్లు ఇచ్చుకోవాలని తెలిపారు.

కుందూ నదిలో యువకుడు గల్లంతు

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 21: కుందూ నదిలో యువకుడు గల్లంతైనట్టు నంద్యాల తాలూకా అర్బన్ సీఐ అస్రార్ భాష బుధవారం తెలిపారు. మండలంలోని రాయమాల్‌పురం గ్రామం సమీపంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు కుందూ నదిలో పడి పోయి కొట్టుకుపోవడాన్ని స్థానికులు గుర్తించారు. వరదతో కుందూ నది ఉధృతంగా ప్రవహించడంతో స్థానికులు ఆ యువకుడిని కాపాడలేకపోయారు. నంద్యాల తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ అస్రార్ భాష, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ళతో గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడి ఆచూకి లభించలేదని గురువారం కూడా గాలింపు చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

జీడీపీని పరిశీలించిన ఎస్పీ

- గంజహళ్లి, ఐరన్‌బండ గ్రామాలో జరిగిన సంఘటన పై ఆరా



జీడీపీ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

గోనెగండ్ల ఆగస్టు 21: గాజులదిన్నె ప్రాజెక్టును బుధవారం సాయంత్రం ఎస్పీ బిందుమాధవ్ పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారాన్ని జీడీపీ ఇరిగేషన్ డీఈ విజయ్ కుమార్ ఎస్పీకి వివరించారు. అలాగే ఎస్పీ మంగళవారం సాయంత్రం గంజహళ్లి, ఐరన్‌బండ గ్రామాలకు చెందిన రైతులు వరద నీటిలో చిక్కుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు తగు సమయంలో స్పందించడంతో రెండు గ్రామాలకు చెందిన రైతులు క్షేమంగా బయట పడ్డారని ఎస్పీకి వివరించారు.. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మహమ్మద్‌ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ ఉద్యోగాలతో మోసం

కర్నూలు, ఆగస్టు 21: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి.. కొన్ని నెలలు జీతాలు ఇచ్చి.. మోసం చేసిన ముగ్గురుని తాలుకా పోలీసులు అరెస్టు చేశారు. షేక్ జహీర్‌బాషా (బాలాజీనగర్, కర్నూలు), ఆయేషా బాను (బాలాజీనగర్, కర్నూలు), ఆమె భర్త షేక్ మహ్మద్ జాకీర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. షేక్ జహీర్‌బాషా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ గ్రేడ్-3 ఉద్యోగిగా పని చేస్తున్నాడు. బాలాజీనగర్‌లో ఉన్న తన చెల్లెలు షేక్ ఆయేషాబాను, ఆమెభర్త షేక్ జాకీర్‌లతో కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేసుకున్నారు. రామచంద్రనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా అనే వ్యక్తికి, మరి కొంత మందికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకున్నారు. వీరికి ఎఫ్‌సీఐ సంస్థకు చెందిన నకిలీ సీళ్లు, లెటర్ ప్యాడ్లు, రాజముద్రలు తయారు చేసి డబ్బులు కట్టినవారందరికీ నకిలీ అపాయింట్‌మెంట్లు ఇచ్చారు. వారికి అనుమానం రాకుండా వర్క్ ఫ్రమ్ హోమ్ అని చెప్పి ఇంటి వద్దనే కొన్ని నెలలు పని చేయించారు. పని చేసిన నెలలకు సొంతంగా జీతాలు చెల్లించారు. అలా వారి ద్వారా మరి కొంత మంది నిరుద్యోగులు భారీ మొత్తంలో డబ్బులు చెల్లించారు. తీరా తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను అరెస్టు చేసి వారిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

ఐదుగురు మహిళల అరెస్టు

ఆదోని రూరల్ ఆగస్టు 28 : ఆదోని పట్టణం ఒకట పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఐదుగురు మహిళలను తాలుక పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ బస్సులో కర్ణాటక మద్యం తరలిస్తున్నారని సమాచారంతో రూరల్ సీఐ నల్లన్న, ఎస్.ఐ రామాంజనేయులు బుధవారం బైచిగేరి క్రాస్ వద్ద దాడులు నిర్వహించి సరోజ, ఈరమ్మ, లక్ష్మీ, హనుమంతమ్మ, మానసలను అదుపులో కి తీసుకొని వారి వద్ద నుంచి రూ.40వేలు విలువ చేసే 700 కర్ణాటక మద్యం పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఆదోని, ఆగస్టు 21: ఆదోని పట్టణంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితుడు పట్టణంలోని ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ తర్వాత ఆ బాలికను మోసం చేసి ఇంటికి పంపించాడు. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదు మేరకు తాము కేసు నమోదు చేసి మైనర్ బాలికను మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ రామలింగప్ప తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ నాయకుడిపై దాడి

దేవనకొండ, ఆగస్టు 21 : మండల బీజేపీ నాయకుడు బోడ రవికుమార్‌పై కుంకనూరు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేయడంతో కేసు నమోదు చేసిన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 15వ తేదీ రాత్రి టర్నింగ్ సమీపంలో కుంకనూరు గ్రామానికి చెందిన బండారి తిమ్మప్ప, లక్ష్మన్న, సోమ్మన్న అనే వ్యక్తులు రవికుమార్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. న రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు.









అహోబిలం నుంచి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ప్రధాన అర్చకులు | శ్రీమఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు | వీణ వాయిస్తున్న కళాకారులు | పట్టువస్త్రాలను పీఠాధిపతికి సమర్పిస్తున్న అహోబిలం అర్చకులు

జయహో రాఘవేంద్ర..

- స్వర్ణరథంపై విహరించిన రాఘవరాయలు
- బృందావనానికి మహా పంచామృతాభిషేకం
- గజవాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు
- ఘనంగా కొనసాగుతున్న సప్తరాత్రోత్సవాలు



బృందావనానికి మహాభిషేకం చేస్తున్న పీఠాధిపతి



అశేష భక్తజనవాహిని మధ్య బంగారు రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రుడు



బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 21: ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక మఠం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 353వ సప్తరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ముఖ్యమైన నాలుగో రోజు మధ్యారాధనకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన సందర్భంగా మధ్యారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం మఠం పీఠాదిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పీఠాధిపతి చేతుల మీదుగా మహావిశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అహోబిళం లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నుంచి ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్ పట్టువస్త్రాలను సమర్పించారు. మఠం ప్రధాన ముఖద్వారం నుంచి రాఘవేంద్రస్వామి బృందావనం వరకు పట్టువస్త్రాలను ఘనంగా ఊరేగింపుతో తీసుకువచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి ఉత్సవమూర్తిని స్వర్ణ రథంపై అధిష్టించి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మహా మంగళహారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాలు, భక్తుల హర్షధ్వానాల నడుమ రాఘవేంద్రులవారు విహరిస్తుండగా భక్తులు భక్తిపారవశ్యంతో తన్మ యం చెందారు. రథం ముందు భాజాభజంత్రీలు, కోలాటాల నృత్యాలు, మహిళల భక్తిగీతాలు, ఆహ్వానం పలుకుతూ ఊరేగిస్తున్న దృశ్యం భక్తులను కనువిందు చేశాయి. దక్షిణాది రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనవాహినితో మంత్రాలయం మఠం ప్రాంగణం మార్మోగింది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు గజ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, విచారణకర్త శ్రీనివాస్ ఖస్బే, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సూపరింటెండెంట్ రవి కులకర్ణి, సుజీంద్రచార్, విజయేంద్రాచార్, జయతీర్థాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, నకటే శ్యాంప్రసాద్, వ్యాసరాజాచార్, డీఎం ఆనందరావు, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

● **అలరించిన భరతనాట్యం:** మధ్యారాధనలో భాగంగా బుధవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగుళూరు, మైసూరు చెందిన కళాశిల్ప క్షేత్ర నటరాజ్ కళాబృందం ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది. శివమొగ్గకు చెందిన సరస్వతి, సంగీత విద్యాలయ వారిచే వీణావాయిద్యం భక్తులను కనువిందు చేసింది. వీరికి పీఠాధిపతులు నగదు, శేషవస్త్రం, ఫలపుష్ప, మంత్రాక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు.

● **రాఘవేంద్రస్వామి సన్నిధిలో ప్రముఖులు:** ఉత్సవాల్లో నాల్గవ రోజు బుధవారం తమిళనాడు మాజీ మంత్రి చిన్నయ్య, కర్ణాటక హైకోర్టు జస్టిస్ శ్రీశానందా, ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధానారాయణమూర్తి, గౌహతి రిటైర్డ్ చీఫ్ జడ్జి శ్రీధర్‌రావు, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస్‌రావు, కన్నడ సినీ నటుడు, రాజ్యసభ సభ్యులు జగ్గేష్, ఆర్డీఓ చల్లా విశ్వనాథ్, డీఎస్పీ సోమన్న, టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి వేర్వేరు సమయాల్లో రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు.

నేడు మహా రథోత్సవం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఉత్తరాధనలో భాగంగా గురువారం రాఘవేంద్రుల మహారథోత్సవం వైభవంగా జరగనుంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మహాముఖద్వారం ముందు ఉంచిన మహారథంపై అధిష్టించి హారతులు ఇచ్చి భక్తులనుద్దేశించి పీఠాధిపతి దివ్యసందేశాన్ని ఇస్తారు. అక్కడే మైసూరు మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్‌కు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి-2024 అవార్డును పీఠాధిపతి ప్రధానం చేయనున్నారు.



సింహ వాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు



ఊంజల సేవ చేస్తున్న పీఠాధిపతి



టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డిని ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి

త్వరలో అందుబాటులోకి క్యాన్సర్ ఆసుపత్రి

● **కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు**



స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను పరిశీలిస్తున్న కర్నూలు ఎంపీ

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 21: సాధ్యమైనంత త్వరగా స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రిని పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. బుధవారం ఎంపీ కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణంలో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను సందర్శించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో క్యాన్సర్ హాస్పిటల్ పూర్తి కాలేదని దాదాపు 20 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆసుపత్రికి రావాల్సిన నిధులను తీసుకువచ్చి త్వరగా పూర్తి చేస్తామన్నారు. క్యాన్సర్ హాస్పిటల్ పూర్తయితే రాయలసీమ ప్రాంత ప్రజలు చికిత్స కోసం మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ఎంపీ వెంట కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వర్లు, క్యాన్సర్ విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ కృష్ణ ప్రకాష్, నర్సింగ్ సూపరింటెండెంట్ అనుసూయమ్మ తదితరులు ఉన్నారు.

భార్యే చంపేసింది

- సారా వ్యాపారి హత్యకేసును ఛేదించిన పోలీసులు

- పోలీసులను అభినందించిన ఏస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఆదోని డిఎస్పీ సోమన్న

ఆదోని రూరల్, ఆగస్టు 21 : పెద్దహరివాణం సారా వ్యాపారి హత్య కేసు మిస్టరీని ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. ఆస్తి కోసం భర్త శేకన్న(50)ను మొదటి భార్యే చంపిందని పోలీసులు తేల్చారు. బుధవారం పత్రికా సమావేశంలో ఆదోని డిఎస్పీ సోమన్న, ట్రైనీ డిఎస్పీ ధీరజ్, రూరల్ సీఐ నల్లన్న ఈ విషయం తెలిపారు. మొదటి భార్య జయమ్మే ఆస్తికోసం భర్తను చంపిందని అన్నారు బుధవారం నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సారా వ్యాపారి హత్యకేసును 48గంటల్లో ఛేదించడంతో ఆదోని రూరల్ పోలీసులను, డిఎస్పీని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.

రైతులను ఆదుకుంటాం : జేడీ

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 21: కర్నూలు జిల్లాలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎంత విస్తీర్ణంలో పంటలు రైతులు నష్టపోయారో గ్రామాలకు మండల వ్యవసాయాధికారులు, వారి సిబ్బంది పర్యటించి నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను అందజేశారని ఉద్యానశాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. కర్నూలు జిల్లాలో ఆలూరు మండలంలో 18 మంది రైతులు 4.76 హెక్టార్లలో సాగు చేసిన మిరప పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. అదే విధంగా ఆస్పరిలో 43.52 హెక్టార్లల్లో 30 మంది రైతులు నష్టపోయారని, దేవనకొండలో 29.88 హెక్టార్లలో 26 మంది రైతులు 4.65 లక్షల విలువ చేసే పంటలు దెబ్బతిన్నాయని, హాలహర్విలో రెండు హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, కౌతాళంలో 178 హెక్టార్లలో సాగు చేసిన పంటలు దెబ్బతిని 234 మంది రైతులకు రూ.30.26 లక్షల నష్టం జరిగిందని బుధవారం విలేకరుల సమావేశంలో జేడీ తెలిపారు. మద్దికెరలో 60హెక్టార్లలో సాగైన పంటలు దెబ్బతిని 55 మంది రైతులకు రూ.10.2లక్షల నష్టం జరిగిందన్నారు. మద్దికెరలో 60 హెక్టార్లు, మంత్రాలయంలో 74.5 హెక్టార్లు, పత్తికొండలో 131.2 హెక్టార్లు, మొత్తం పది మండలాల పరిధిలో 558.9 హెక్టార్లలో 695 మంది రైతులకు రూ.94.703 లక్షల నష్టం జరిగిందన్నారు. పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నట్లు జేడీ తెలిపారు. అదే విధంగా వ్యవసాయ పంటలకు 11 మండలాల పరిధిలో 58 గ్రామాల్లో వరి 550 హెక్టార్లు, పత్తి 2,777 హెక్టార్లు, వేరుశనగ 237 హెక్టార్లు, కంది 640 హెక్టార్లు, ఆముదం 18 హెక్టార్లు, సజ్జ 78 హెక్టార్లు, కొర్ర 5 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 2 హెక్టార్లు మొత్తం 4,307.69 హెక్టార్లలో వ్యవసాయ పంటల్లో నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి, ఆగస్టు, 21: మండలంలో సూదేపల్లె గ్రామానికి చెందిన మాల ఆంజనేయులు (34) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పుకు ఉన్న ఫ్యాన్ కొక్కెంకు తాడుతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

భూమి కోసం మహా మోసం..!

- అధికారుల సంతకాలు ఫోర్జరీ
- పెద్దకడబూరు పొలం.. కల్లూరులో రిజిస్ట్రేషన్
- సమాచార హక్కుచట్టంతో వెలుగులోకి..



న్యాయం చేయాలని వేడుకుంటున్న మహ్మద్ దేశాయ్, అస్లాం

ఆదోని, ఆగస్టు 21: ఆదోని డివిజన్‌లో రోజు రోజుకు పొలం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో కొందరు నకిలీ సర్టిఫికెట్లను సృష్టించి రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్నారు. ఇందుకోసం కీలక అధికారుల సంతకాలను సైతం ఫోర్జరీ చేసేందుకు వెనుకాడలేదు. పెద్దకడబూరు మండలం కల్లకుంట గ్రామానికి చెందిన హుస్సేన్ దేశాయ్, ఫాతిమా బీలకు ఉస్మాన్ దేశాయ్, గని దేశాయ్, అబ్దుల్ హమీద్, మమ్మద్, ఫరుదేశాయ్ ఐదుగురు సంతానం. వారిలో పెద్ద కుమారుడు ఉస్మాన్ దేశాయ్‌కి పెళ్ళి కాలేదు. దీంతో అక్కడి నుంచి ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామానికి వచ్చి నివాసం ఉంటున్నాడు. ఈయన 2015 నవంబరు 9న మృతి చెందాడు. ఆయనకు 312/1 సర్వే నంబర్‌లో 99 సెంట్లు, 389లో 3.60 ఎకరాలు, మొత్తంగా 4.59 ఎకరాల పొలం ఉంది. ఈ పొలాన్ని ఎలాగైనా సొంతం చేసుకోవాలని అబ్దుల్ హమీద్ దేశాయ్ భార్య హజరత్ బీ ప్లాన్ చేసింది. మిగతా కుటుంబ సభ్యులకు తెలియకుండా ఉస్మాన్ దేశాయ్ తమ కుటుంబంలో వ్యక్తి అని 2020 సెప్టెంబరు 12వ తేదీన హజరత్ బీ చనిపోయినట్లుగా అప్పటి తహసీల్దార్ డి.వెంకటసాయి డెత్ సర్టిఫికెట్ ఇచ్చినట్లుగా దొంగ సర్టిఫికెట్ పుట్టించారు. ఆ సమయంలో కుమారస్వామి అనే తహసీల్దార్ అక్కడ పనిచేస్తున్నారు. ఆ పొలాన్ని ఆక్రమించుకునేందుకు ఫ్యామిలీ సర్టిఫికెట్ అవసరం కావడంతో 2021 సెప్టెంబరు 12వ తేదీన హజరత్ బీ బతికున్నట్లు ఫ్యామిలీ సర్టిఫికెట్ పుట్టించారు. 2020లో చనిపోయినట్లు గాను 2021లో బతికున్నట్లు గాను ఫ్యామిలీ సర్టిఫికెట్ తయా రు చేయించారు. ఇదిలా ఉండగా ఉస్మాన్ దేశాయ్ పెద్ద తుంబలంలో అనారోగ్యంతో మృతిచెందగా పంచాయతీ కార్యదర్శి ఇవ్వాల్సి ఉన్న డెత్ సర్టిఫికెట్‌ను మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తయారు చేశారు. మొత్తం నకిలీ డాక్యుమెంట్లను సిద్ధం చేసుకుని కల్లూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వెళ్లి 2024 జూలై 12వ తేదీన ఆ పొలాన్ని ఎనీవేర్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ రికార్డులన్నీ సమాచార హక్కు చట్టం ద్వారా బయటకు తీయడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. న్యాయవాది చంద్రయ్యతో పాటు ఆ కుటుంబంలో ఉన్న సభ్యులందరూ కలిసి పెద్ద తుంబలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కల్లూరు సబ్ రిజిస్ట్రార్ షేక్ నాసీర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఆర్‌వోఆర్, అడంగల్ సరిగ్గా ఉందని, అందుకే రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు.

గోడౌన్‌ను చుట్టుముట్టిన నీరు




జి. లింగాపురం గ్రామంలో ధాన్యం నిల్వ గోడౌన్, రైతు భరోసా కేంద్రాన్ని చుట్టుముట్టిన వాగు నీరు

బండిఆత్మకూరు, ఆగస్టు 21: జి. లింగాపురంలో నిర్మించిన ధాన్యం నిల్వ గోదామును, రైతు భరోసా కేంద్రాన్ని రెండు రోజులుగా గుంపెనవాగు నీరు చుటుముట్టింది. గత వైసీపీ హయాంలో రెవెన్యూ అధికారులు గుంపెనవాగు పక్కనే స్థలం మంజూరు చేశారు. దీంతో రూ.కోటి మేర నిధులతో 1000 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో పరమటూరు సహకార సంఘం ద్వారా గోదాము, అలాగే రైతు భరోసా కేంద్రం నిర్మాణాలు గుంపెనవాగు వాగుకు సమీపంలో నిర్మించారు. ప్రస్తుతం వాగుకు మూడు చెరువుల నీరు, వాన నీటి ప్రవాహం కారణంగా నీరు చుట్టుముట్టాయి. నీటి ప్రవాహం కొనసాగినన్ని రోజులు పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఇలా ఉంటే రైతులు ధాన్యం నిల్వకు భద్రత ఏమిటి అని రైతుల్లో సందిగ్ధం నెలకొంది. రైతు భరోసా కేంద్రానికి సిబ్బంది వెళ్లాలంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోగలరు. వాగుకు ఓ వైపు మట్టి కట్ట ఎత్తు పెంచితే నీటి నిల్వను అరికట్టవచ్చని రైతులు కోరుతున్నారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి: మంత్రి



పతకాలు సాధించిన విద్యార్థులతో మంత్రి ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 21: విద్యార్థులు చదువుతో పాటు కళలు, క్రీడల్లో రాణించేందుకు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. మాతృభూమికి కళార్చన, ఏపీ బయోడైవర్శిటి నిర్వహించిన వక్తృత్వం, క్విజ్, షార్ట్‌ఫిలిం పోటీలు, స్వాతంత్ర్య వేడుకల్లో పథకాలు సాధించిన గురాజ విద్యార్థులకు బుధవారం అభినందన సభను ఏర్పాటు చేశారు. మంత్రి ఫరూక్‌తో పాటు గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి, రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, కళారాధన సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాతృభూమికి కళార్చన పోటీల్లో వివిధ విభాగాలలో విజేతలుగా నిలిచిన 103 మంది విద్యార్థులకు, ఏపీ బయోడైవర్సిటీ నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులకు, స్వాతంత్ర్య వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనల్లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు మంత్రి ఫరూక్ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. వివిధ రంగాలలో విశేషంగా రాణిస్తున్న విద్యార్థులు వారి ప్రతిభా శక్తిని, నాయకత్వ లక్షణాలను మరింతగా పెంపొందించుకోవాలని ఫరూక్ ఆకాంక్షించారు. గురురాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్లు మౌలాలి రెడ్డి, షేక్షావలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే బుడ్డా



సీఎం చంద్రబాబుకు సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 21: శ్రీశైలం నియోజక వర్గం అభివృద్ధికి సంబంధించి బుధవారం సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కలిశారు. సచివాలయంలోని సీఎంవో కార్యాలయం నందు సీఎం చంద్రబాబు దృష్టికి నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన అభివృద్ధి అంశాలపై చర్చించారు. ప్రత్యేకించి ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.116కోట్లతో నాన్‌అమృత్ వాటర్ స్కీమ్‌లో భాగంగా ఇంటింటికి కొళాయిల ఏర్పాటు, సున్నిపెంట గ్రామంలో శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం ఇతర నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రికి విన్నవించారు. ఆయా సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం చంద్రబాబు శ్రీశైల నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని భరోసా ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

నంద్యాల క్రైం, ఆగస్టు 21: ప్రస్తుత టెక్నాలజీ రంగంలో సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా వేదికగా ప్రజలను బురిడీ కొట్టించేందుకు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారని, అలాంటి వారి ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. బుధవారం ఎస్పీ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల వేదికగా సైబర్ నేరగాళ్లు తమ పేరిట ఒక వెబ్‌సైట్‌ను రిజిస్టర్ చేయించుకొని ఆ వెబ్‌సైట్‌కు సంబంధించిన లింకును సామాజిక మాధ్యమాల్లో ఉంచి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటువంటి నేరాల్లో మొదట సైబర్ నేరగాళ్లు తమకు సంబంధించిన ఒక వెబ్‌సైట్ లింక్‌ను సోషల్ మీడియాలో ఉంచి ఈ వెబ్‌సైట్‌లో డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే మీకు తక్కువ వ్యవధిలో ఎక్కువ లాభాలొస్తాయనే కొన్ని స్కీమ్స్‌కు సంబంధించిన వీడియోలను అప్‌లోడ్ చేస్తుంటారని చెప్పారు. ఇందులో మీకు ఎలాంటి అనుమానాలున్నా ఫలానా నెంబర్‌ను కాంటాక్ట్ కావచ్చని ఒక నెంబర్‌ను సోషల్ మీడియాలో పెడతారని చెప్పారు. ప్రజలు వారి సైట్‌లోకి వెళ్లి సదరు నెంబర్‌కు కాంటాక్ట్ అయితే మొదట నేరగాళ్లు కొంత మొత్తంలో రిటర్న్స్ ఇస్తారని, దీన్ని నిజమని నమ్మి మీరు పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చే సి లాభాల కోసం ఎదురుచూసినా రాకపోయేసరికి నేరగాళ్ల వెబ్‌సైట్‌కు సంబంధించిన నెంబర్‌ను సంప్రదిస్తే అది మనుగడలో లేదనే సమాధానం వస్తుందన్నారు. ఆ వెబ్‌సైట్ కోసం మీరు సోషల్ మీడియాలో వెతికినా కనిపించదని అన్నారు. అందువల్ల ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ సోషల్ మీడియాలో వచ్చే ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించిన వీడియోలను నమ్మవద్దని సూచించారు. మీకు పరిచయం లేని వ్యక్తులద్వారా వచ్చే డబ్బు పెట్టుబడికి సంబంధించిన స్కీమ్స్‌నందు డబ్బు పెట్టుబడి పెట్టవద్దన్నారు. మీకు తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దని ఎస్పీ సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయినట్లయితే మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లోకానీ, సైబర్ మిత్రవారికి కానీ, 1930నెంబర్ లేదా జిల్లా సైబర్ క్రైం ఆఫీస్ 9154987034 నెంబర్‌కు 24గంటల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

పాణ్యం, ఆగస్టు 21: పాణ్యంలోని టి.చంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీవీ రామన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి రసాయణ శాస్త్రం, చరిత్ర ఉపన్యాసకుల ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. ప్రభుత్వ అనుమతి పొందిన యూనివర్సిటీ నుంచి పీజీలో కనీసం 50 శాతం మార్కులతోఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు.ఈనెల 24వ తేదీ లోపల దరఖాస్తులు పంపించాలన్నారు. ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు డెమో అనంతరం అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గంటకు రూ.150 ప్రకారం నెలకు రూ.10 వేలు మించకుండా పారితోషికం ఉంటుందన్నారు. పదవీ విరమణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

పశుసంపదను కాపాడుకోవాలి: కలెక్టర్



ఘనీకృత వీర్యకేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 21: పశుజాతి అంతరించిపోతున్న ఈ రోజుల్లో నాణ్యమైన ఘనీకృత వీర్యాన్ని తయారుచేసి పశువులను ఉత్పత్తి చేయడంలో నంద్యాల ఘనీకృత వీర్యకేంద్రం కీలకపాత్ర పోషిస్తుందని, పశుసంపదను కాపాడుకోవాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం నంద్యాల పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఘనీకృత పశువీర్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ఈ సంస్థలో 10 జాతుల పశువులను వీర్యాన్ని సేకరించి భద్రపరిచి అవసరమైన జిల్లాలలో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ కేంద్రం నుంచి వీర్యాన్ని సరఫరా చేస్తున్నారన్నారు. సెమన్‌బ్యాంక్, బుక్ మేనేజ్‌మెంట్, లేబొరేటరీ, డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లను సందర్శించి చక్కగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ ప్రశంసించారు. ఇక్కడి ఆబోతులను బయో సెక్యూర్ జోన్‌లో ఉంచి వ్యాధులు సోకకుండా క్రమం తప్పకుండా టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారి గోవిందనాయక్ కలెక్టర్‌కు వివరించారు. 6.94 ఎకరాల విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, ఘనీకృత వీర్య కేంద్రం ఉందన్నారు. కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు ముగ్గురు వెటర్నీరీ అసిస్టెంట్ సర్జన్లు, సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వీటిలో ఘనీకృత వీర్యకేంద్రం 5 ఎకరాల భవనాలు ఉండగా 11.94 ఎకరాలలో ఆబోతులకు కావాల్సిన సూపర్‌నేపియర్, కాకిజొన్న, గినిగడ్డి లాంటి నాణ్యమైన పశుగ్రాసాన్ని పండిస్తున్నారన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద జరుగుతున్న పనుల గురించి తెలుసుకుంటూ సివిల్ వర్క్‌కు చెందిన పనులు త్వరతిగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ముఖ్యమంత్రిని కలిసిన మల్లెల రాజశేఖర్



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజశేఖర్ దంపతులు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 21: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బుధవారం సెక్రటేరియట్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఆయన సతీమణి మల్లెల జ్యోతి మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం చంద్రబాబుకు మల్లెల దంపతులు పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలోని సమస్యలపై సీఎంకు వినతి ప్రతం ఇచ్చారు. కాలువ బుగ్గ దేవాలయ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలోని రైతులకు వ్యవసాయ పరంగా తాగునీటిని అందించే క్రమంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని మల్లె రాజశేఖర్ తెలిపారు.

సహకార బ్యాంకు సిబ్బంది నిరసన



బ్యాంకులో నిరసన తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

వెలుగోడు, ఆగస్టు 21: వెలుగోడు పట్టణంలోని కో ఆపరేటివ్ బ్యాంకులో అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జిలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. బ్యాంక్ మేనేజర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని చెప్పారు. సీపీసీఎస్ కంప్యూటరైజేషన్ విధానానికి, ఉద్యోగులపై తీసుకువస్తున్న విపరీతమైన ఒత్తిడికి నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించామన్నారు. బ్యాంకు అధికారులు సిబ్బంది, సహకార సంఘాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

వెలుగోడు, ఆగస్టు 21: వెలుగోడు మండలంలోని బోయరేవుల గ్రామంలో నంద్యాల జిల్లా ఈఆర్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎస్తేరాణి, రతన్‌రాజు ఆధ్వర్యంలో వంద మంది నిరుద్యోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. నిరుపేదలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

నంద్యాల టౌన్, ఆగస్టు 21: నంద్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను సస్పెన్షన్ చేసినట్లు కమిషనర్ నిరంజన్‌రెడ్డి బుధవారం రాత్రి తెలిపారు. పట్టణంలో ఓ ఖాళీ స్థలం వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉండగానే ఆ స్థలానికి వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్(వీఎల్‌ఏ)ను విధించడంపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ ఆర్వో కృష్ణ, ఆర్ఐ గులాం హుసేన్, 35వ వార్డు సచివాలయ అడ్మిన్ ఇన్‌చార్జి సుధాకర్‌ను సస్పెండ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

'అప్రకటిత విద్యుత్ కోతలు ఆపాలి'

కొత్తపల్లి, ఆగస్టు 21: మండలంలో విద్యుత్ అధికారులు వేలాపాలా లేకుండా విద్యుత్ కోతలు విధించడం వల్ల మండల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అప్రకటిత విద్యుత్ కోతలు అరికట్టాలని సీపీఎం మండల నాయకులు నక్క స్వాములు, సంజీవరాయుడు, ఏసన్న డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. పోతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. రైతులు రాత్రివేళల్లో పంట పొలాల వద్ద విద్యుత్ కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉందన్నారు. అంతేగాకుండా రాత్రి వేళల్లో మండల ప్రజలు దోమలు, ఉక్కపోతతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని, విద్యుత్ సబ్ స్టేషన్లకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి'



మాట్లాడుతున్న రామాంజనేయులు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 21: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టులపై దృష్టి పెట్టి రాయలసీమ జిల్లాల రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ, కర్ణాటక ఏపీ రాష్ట్రాలకు తుంగభద్ర నుంచి వస్తున్న తాగునీరు, వ్యవసాయానికి ఉపయోగ పడుతుందని అన్నారు. ఇటీవలే వరద తాకిడికి తుంగభద్ర గేటు కొట్టుకు పోవడంతో వందలాది టీఎంసిల నీరు వృథా కావడంతో రాయలసీమ జిల్లాల రైతులకు కష్టంగా మారిందన్నారు.సిద్ధేశ్వరం, వేదవతి, గాలేరు నగరి ప్రాజెక్టులు త్వరగా నిర్మించి వరద జలాలను ఒడిసి పట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ పట్టణ కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, శ్రీనివాసులు,సంతఊవ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దాడులు

నంద్యాల క్రైం, ఆగస్టు 21: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నియంత్రణ లక్ష్యంగా చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది బుధవారం విస్తృతదాడులు నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది 51బృందాలుగా విడిపోయి వసతిగృహాలను సందర్శించి ఫుడ్ సేఫ్టీపై వసతి గృహ నిర్వాహకులు, వంట సిబ్బందికి పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై, మహిళలపై జరిగే నేరాలు, ఈవ్ టీజింగ్‌ను ఎలా ఎదుర్కోనాలి తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏదైనా సమస్య వచ్చినపుడు 100 నెంబర్‌కుగాని, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు గాని సమాచారం అందించాలని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా 283మందిపై కేసు నమోదు చేసి రూ.1,53,245 జరిమానా విధించారు. మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్‌లపై ప్రత్యేకదృష్టి ఉంచి నివారణ చర్యల్లో భాగంగా పట్టుబడిన 18మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన 64మందిపై కేసులు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్ : ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా విడిపోయి జిల్లాలోని ఆయా గ్రామాలు, పట్టణాల ముఖ్య కూడళ్లు, బ్లాక్ స్పాట్‌ల వద్ద సివిల్, ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేస్తూ ఎంవీఐ వాహనాల చట్టం ప్రకారం నిబంధనల పాటించని వారిపై కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 114వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

బంద్ ప్రశాంతం



పాములపాడులో నిరసన తెలుపుతున్న నాయకులు



నందికొట్కూరులో..

నందికొట్కూరు, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన బంద్ నందికొట్కూరులో ప్రశాంతంగా సాగింది. మాలమహానాడు నాయకులు నందికొట్కూరు కొత్తబస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులను నిలుపుదల చేసి నిరసన తెలిపారు. అక్కడి నుంచి బయలుదేరి పాతబస్టాండ్‌లోని పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. దుకాణాలను మూయించి బంద్‌ను పాటించారు. మాలమహానాడు నాయకులు డా. రాజు, వివిధ పార్టీల నాయకులు అయ్యన్న, శాంతరాజు పాల్గొన్నారు.

పాములపాడు: ఎస్సీ వర్గీకరణ వద్దు, ఐక్యతముద్దు అని ఉప వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలని రాష్ట్ర మాల మహానాడు నాయకులు నల్లమల అబ్రహం, కలబండి అంకన్న నాయకులు నాగరాజు, శ్రీకాంత్, వామ పక్షాల నాయకులు వినాదాలు చేశారు. బుధవారం పాములపాడులోని బస్టాండు వద్ద కెజిరోడ్డుపై భారత్‌బంద్‌లో భాగంగా దర్నా చేశారు. సీపీఎం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని మాలమహానాడు జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మల్లయ్య కేశాలు, మల్లె ఎలీషా, చింతలయ్య, శీలం శేషు, నాగేంద్ర, వెలుగోడు సర్పంచ్ జయపాల్ కోరారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా బుధవారం వారు ఆత్మకూరు పట్టణంలో నిరసనలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతంలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందని, అయితే ప్రస్తుతం అదే అంశాన్ని సమంజసమని తీర్పు ఇవ్వడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని, ఈతీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులో తాము పిటిషన్ వేస్తామని వెల్లడించారు.

వెలుగోడు: వెలుగోడు మండలంలో ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ చేపట్టిన భారత్‌బంద్ పాక్షికంగా జరిగింది. ప్రైవేట్ పాఠశాలలు బంద్ పాటించగా , ప్రభుత్వ పాఠశాలలకు నిరసన కారులు వెళ్ళి బంద్ చేయించారు. దుకాణాలు బస్సులు యథావిధిగా పని చేశాయి.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకురాలు హిమబిందు

శ్రీశైలం, ఆగస్టు 21: భక్తుల సౌకర్యార్థం దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి గుజరాత్‌కు చెందిన పి.విశ్వంభర అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాతలు ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. దాతలను దేవస్థానం అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు.

'వ్యవసాయాధికారుల సూచనలు పాటించండి'

వెలుగోడు, ఆగస్టు 21: రైతులు వ్యవసాయాధికారులు ఇచ్చే సలహాలు సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులు సెప్టెంబరు 15వ తేదీలోగా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో వరి పంట 3500 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం ఉండగా ఇప్పటికే 1500 హెక్టార్లు నాటు వేసుకున్నట్లు తెలిపారు. పంటల సాగు గురించి, పురుగుల నివారణ గురించి తెగుళ్ల గురించి రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది అంజిత్ కుమార్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

రేపు గ్రామసభలు

పాములపాడు, ఆగస్టు 21: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపీకృష్ణ తెలిపారు. పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఉపాధి హామీ ఏపీవో విమలమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మేరీ తెలిపారు. బుధవారం ఎంపీడీవో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద కొత్త పనుల గుర్తింపు కోసం ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటాయని గ్రామ సభల్లో ప్రజలు ఏయే ప్రాంతాల్లో కొత్త పనులు కావాలో తెలియజేయాలని ఎంపీడీవో మేరీ కోరారు.

ఆత్మకూరు: ఈ నెల 23న మండలంలో గ్రామ సభలను పకడ్బందీగా జరపాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ అన్వరా బేగం సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామసభల్లో ప్రధానంగా ఎంజీఎన్ఆర్ఈ జీఎస్ ద్వారా వేతనాలను కోరే హక్కు, అర్హతలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటివరకు మంజూరైన, పురోగతి ఉన్న పనులను గ్రామసభ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎంపీడీవో మోహన్‌కుమార్, ఏఓ మోహన్ కుమార్, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగమ్మ ఉన్నారు.

'ఆర్టీసీ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు'

ఆత్మకూరు, ఆగస్టు 21: ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో గత జూలై నెలలో ఉత్తమంగా రాణించిన ఆర్టీసీ ఉద్యోగులకు బుధవారం ఆర్టీసీ ఉన్నతాధికారులు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈసందర్భంగా డిపో మేనేజర్ మహేంద్రుడు మాట్లాడుతూ.. జూలై -2024 నెలకు సంబంధించి అత్యధిక ఆదాయం సమకూర్చిన కండక్టర్లు జీఆర్ఎల్ రెడ్డి, బీఆర్ వాణి, జీసీ నాగమ్మ, షఫివుల్లా, ఈఎస్ లక్ష్మీ, ఎస్ఏన్ బాషా, గోవిందయ్య, ముర్తుజాబీ, ఎంఆర్ శేఖర్, జీ.శ్రీనివాసులు, మోహన్‌లతో పాటు అత్యధిక కేఎంపీఎల్ సాధించినట్లు తెలిపారు. డ్రైవర్లు దర్గయ్య, శివారెడ్డి, పీఆర్‌సీరెడ్డి, ఎస్‌కే.వలి, రహంతుల్లా, ఓబులేసులకు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంస పత్రాలను పంపిణీ చేశారు. మిగతా ఉద్యోగులు వీరిని ఆదర్శంగా తీసుకుని ఆత్మకూరు ఆర్టీసీ డిపోను లాభాల బాటలో నడిపించాలని డీఎం మహేంద్రుడు విజ్ఞప్తి చేశారు.

'తూతూమంత్రగా రోడ్డు నిర్మించారు'

మహానంది, ఆగస్టు 21: మండలంలోని గిరిజన కాలనీలో ఇటీవల అధికారులు తూతూ మంత్రంగా రహదారిని నిర్మించి చేతులు దులుపుకొన్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. రామాంజనేయులు తెలిపారు. బుధవారం అబ్బీపురం గిరిజన కాలనీలో వేసిన బీటీ రహదారిని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడుతో కలసి ఆయన పరిశీలించారు. సీపీఐ నాయకులు బాబా ఫక్రుద్దీన్, మండల కార్యదర్శి ఆర్. సామేల్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, సంజీవులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 21: ఏపీ మోడల్ స్కూల్స్‌లలో పని చేస్తున్న ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీఎంఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని ఆసంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ సిబ్బందికి 010 పద్దు జీతాలు పొందటానికి సంఘం చేసిన కృషి అభినందనీయమన్నారు. అలాగే మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు కారుణ్య నియామకాలు ఇతర సమస్యల సాదనకై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోవిందు, ప్రధాన కార్యదర్శిగా ముఖేష్, కోశాధికారిగా డాక్టర్ వెంకటరమణ,లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 21: నంద్యాలలో ఈ నెల 25న జరిగే బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిరంజన్ పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాలలోని క్రాంతి రేఖ గ్రంథాలయంలో నంద్యాల ముస్లిం, క్రిష్టియన్ జేఏసి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మహాసభలకు సంబందించి కరపత్రాలను వారు విడుదల చేశారు. దేశంలో అణగారిన వర్గాలు కేవలం ఓటు బ్యాంకుకే ప్రభుత్వాలు పరిమితం చేశాయని హక్కుల సాధనకు పోరాటం చేయాలని అన్నారు. నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు అబులైస్, అబ్దుల్‌సమ్మద్, ఏపీ, టీఎస్ క్రిష్టియన్ జెఏసి అధ్యక్షుడు పాస్టర్ మన్యం జానయ్య, మౌళానా అబ్దుల్లా, రషాది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు



వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ జఫ్రుల్లా

మిడుతూరు, ఆగస్టు 21: మిడుతూరు గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని హెల్త్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా బుధవారం తనిఖీ చేశారు. రోగులకు వైద్యులు అందించే చికిత్స, సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు తిరుపతి, శారద, భరత్‌కుమార్, సాయిసుధా, ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణ, జబీనా, ఫార్మాసిస్టు మాదన్న, శ్రీజ, నర్సింగ్ ఆఫీసర్ ముర్తుజావలి, ప్రశాంతి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కార్యకర్తలందరికీ న్యాయం చేస్తా'



కోట్ల రాఘవేంద్రరెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

ప్యాపిలి, ఆగస్టు 21: డోన్ నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు కష్టపడిన కార్యకర్తలందరికీ న్యాయం చేస్తామని టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. మండలంలోని నల్లమేకపల్లిలో ఓ శుభ కార్యక్రమానికి హాజరైన ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. నియోజకవర్గంలో తమ కుటుంబంపై ఎంతో నమ్మకంతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రవి కుమార్‌నాయుడు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌నాయుడు, సత్యం నాయుడు, భాస్కర్‌నాయుడు, బాలనరసింహులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమిని జయప్రదం చేయండి

డోన్, ఆగస్టు 21: పట్టణంలో ఈనెల 27న నిర్వహించే శ్రీకృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వర రావు యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణ యాదవ్ స్వగృహంలో కృష్ణాష్టమి వేడుకల పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలోని కురువ యాదవులంతా ఐక్యతను చాటి కృష్ణాష్టమి వేడుకలకు తరలిరావాలన్నారు. ఈ వేడుక లకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు యాదవ్, బద్దల రాముడు, జక్కసాని గుంట్ల మహేష్, శేఖర్ యాదవ్, ప్రకాష్ పాల్గొన్నారు.

అరటి తోటల సాగులో ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న పరదేశీ మహేష్

డోన్, ఆగస్టు 21: అరటి తోటలను సాగు చేయడంలో డోన్‌వాసి పరదేశీ మహేష్‌కు ఉత్తమ జాతీయ అవార్డు లభించింది. తమిళనాడులోని నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ బనానా సంస్థ నుంచి ఈ అవార్డు లభించింది. ఉన్నత విద్య చదువుకుని, రైతు బిడ్డగా మారి డోన్ పట్టణానికి చెందిన పరదేశీ మహేష్ గత కొన్నేళ్లుగా అరటి తోటలను సాగు చేస్తున్నారు. అరటితోటల సాగు చేయడంలో ఎంతో కృషి చేశారు. బుధవారం తమిళనాడులోని తిరుచిరాపల్లిలో తమిళనాడు నేషనల్ రీసెర్చ్ ఫర్ బనాన డైరెక్టర్ డాక్టర్ త్రిలోచన్ మోహపాత్ర డాక్టర్ వీ గీతాలక్ష్మి చేతుల మీదుగా ఆయన ఉత్తమ అవార్డును అందుకున్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగంకండి



మాట్లాడుతున్న ఎంపీడీవో సయ్యదున్నీసా

కోవెలకుంట్ల, ఆగస్టు 21: గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోవెలకుంట్ల ఎంపీడీవో సయ్యదున్నీసా, ఈవోపీఆర్‌డీ రాధికారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధిపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సయ్యదున్నీసా మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీవిద్య, ఈవోపీఆర్‌డి రాధికారెడ్డి, హౌసింగ్ ఏఈ మద్దిలేటి, ఎన్‌ఆర్‌జీఎస్ ఈసీ హరి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఆళ్లగడ్డ, ఆగస్టు 21: ఆళ్లగడ్డ డీఎస్పీగా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ సబ్ డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీని పట్టణ సీఐ చిరంజీవి, రూరల్ సీఐ కంబగిరిరాముడు, పట్టణ ఎస్ఐలు నగీనా, వెంకటరెడ్డి, రూరల్ ఎస్ఐ హరిప్రసాద్, సబ్‌డివిజన్‌లోని పోలీసు అధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

రెండో దశ అడ్మిషన్లు ప్రారంభం

శిరివెళ్ల, ఆగస్టు 21: మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఫేజ్-2 అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సులు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లు జిరాక్సు ప్రతులతో కళాశాలకు వచ్చి అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

శిరివెళ్ల, ఆగస్టు 21: శిరివెళ్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మంచికంటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా వంకదార సునీల్, కోశాధికారిగా మంచికంటి మనోహర్ ఎన్నికయ్యారు. అలాగే ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా బోనగిరి కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడిగా కందూరి నవీన్‌కుమార్, కార్యదర్శిగా శేగు బాలకృష్ణమూర్తి ఎన్నికయ్యారు. శిరివెళ్లలోని అమ్మవారిశాలలో ఈ నెల 24న ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ప్రతినిధులు ప్రమాణస్వీకారం చేసేందుకు ఆర్యవైశ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కోవెలకుంట్ల, ఆగస్టు 21: మండలంలోని రేవనూరు గ్రామానికి చెందిన దేవమ్మ కుటుంబ సభ్యులకు గోస్పాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజరు చంద్రశేఖర్ రూ.2లక్షలు చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజరు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కోనేటి దేవమ్మ ప్రమాదవశాత్తు శనగల యంత్రం వెనక భాగంలోని తొట్టిలో జారి పడి మృతి చెందింది. ఆమె ఏపీజీబీ గోస్పాడు బ్రాంచ్‌లో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పాలసీ చేసి ఉందన్నారు. సదరు ఇన్సురెన్స్ మొత్తం రూ.2లక్షలు బ్యాంకు మేనేజరు, డిప్యూటీ మేనేజరు సాహిత ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందజేశారు. బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ రహిత నల్లమల లక్ష్యం'

రుద్రవరం, ఆగస్టు 21: ప్లాస్టిక్‌రహిత నల్లమల లక్ష్యంగా పనిచేద్దామని డిప్యూటీ డైరెక్టరు అనురాగ్‌మీనా పిలుపునిచ్చారు. రుద్రవరం సబ్‌డివిజను కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ దేవాలయ నిర్వాహకులు ప్లాస్టిక్‌ను వాడకుండా సహకరించాలని పిలుపునిచ్చారు. భక్తులు సైతం వన్యప్రాణుల రక్షణకు సహకరించాలని అన్నారు. నిర్ణయించిన సమయంలోనే పావన క్షేత్రానికి వాహనాలు అనుమతించాలని సిబ్బందిని ఆదేశించారు. నవనరసింహ క్షేత్రాలు నల్లమల అటవిలో ఉన్నాయని, సందర్శించే భక్తులు ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని పిలుపునిచ్చారు. అడవుల సంరక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణ ఎంతో అవసరమని, మనిషి మనుగడకు అడవులు వన్యప్రాణులు ఎంతో దోహదపడతాయని అన్నారు. దేవాలయ నిర్వాహకులు కూడా ప్లాస్టిక్‌పై నిషేధించి సహకరించాలని పిలుపునిచ్చారు. భక్తులు వన్యప్రాణుల సంరక్షణ కోసం సందర్శన వేళ, నియమించిన వెళల్లో భక్తులు వెళ్లేలా త్యాగం చేయాలని అన్నారు. అడవిలో వ్యర్థ పదార్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని సూచించారు. ఎప్పటికప్పుడు స్వచ్ఛసేవకులు, అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్విరాన్‌మెంటు చెక్ పోస్టు వద్ద వాహనాలకు నిర్ణయించిన రేట్ల బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. వన్యప్రాణుల రక్షణకే వైల్డ్‌లైఫ్ విభాగం పనిచేస్తుందన్నారు. వన్యప్రాణుల దాడులకు గురికావద్దు, వన్యప్రాణులపై దాడి చేయవద్దన్నారు. ప్రతి శుక్రవారం రాత్రి ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించిన సమయంలోనే వాహనాల్లో భక్తులు వెళ్లాల్సి ఉందన్నారు.



వేలం నిర్వహిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్‌మీనా, స్క్వాడ్ డీఎఫ్‌వో రామకొండారెడ్డి

● రుద్రవరం ఫారెస్టురేంజ్‌లో ఎర్రచందనం వన్యప్రాణుల వేటగాళ్ల నుంచి పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం నిర్వహించినట్లు డిప్యూటీ డైరెక్టరు అనురాగ్‌మీనా, స్క్వాడ్ డీఎఫ్‌వో రామకొండారెడ్డి అన్నారు. 33 వాహనాలు వేలం నిర్వహించగా 22 వాహనాలు వేలందారులు పాడారు. మిగిలిన 12 వాహనాలను త్వరలో వేలం నిర్వహిస్తామన్నారు. ఈ వేలంలో రూ.3,88,800 ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి, వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, రేంజర్ శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజర్ మృత్యుజావలి, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ సమంజసం కాదు'

అవుకు, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు సమంజసం కాదని జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం అన్నారు. బుధవారం అవుకు పట్టణంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంఘాల నాయకులు భారత్ బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా దేవరత్నం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాలలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఆవుల సుధాకర్, జయచంద్ర, వెంకటసుబ్బయ్య, కటారి ఆదాం, వినయ్, భాస్కర్, శేఖర్, చంద్రపాల్, కిట్టు, కొండయ్య, రాజవర్ధన్ పాల్గొన్నారు.

బనగానపల్లె: ఎస్సీ వర్గీకరణ తగదని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు అన్నారు. బుధవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని కోరారు.

ఉయ్యాలవాడ: మాలమహానాడు నాయకులు చేపట్టిన భారత్‌బంద్ ఉయ్యాలవాడలో ప్రశాంతంగా ముగిసింది. మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు కోగిల ప్రసాద్ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ బస్టాండ్ సెంటర్‌లో నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసులుకు వినతి పత్రం ఇచ్చారు. మాలమహానాడు మండల నాయకులు రవి, గ్రేసయ్య, సుబ్బన్న, ప్రభాకర్, చిన్న బాలన్న పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ కులాల వర్గీకరణ చేశారని మాలమహానాడు తాలుకా నాయకుడు కళ్యాణ ఓబులేసు ఆరోపించారు. భారత్ బంద్‌లో భాగంగా ఆళ్లగడ్డలో బుధవారం మాల మహానాడు ఆధ్వర్యంలో పట్టణంలో బంద్ చేపట్టారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అవుకులో భారత్‌బంద్‌లో పాల్గొన్న మాల సంఘాల నాయకులు



ఉయ్యాలవాడలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఫోన్ పే మాయాజాలం

కోవెలకుంట్ల, ఆగస్టు 21: తమ వాళ్లు ఫోన్ పే చేస్తారని, మీరు చెక్ చేసుకుని కమిషన్ తీసుకుని డబ్బులిండయ్యా ప్లీజ్ అంటూ ఓ మహిళ బ్యాంకు సర్వీసు కస్టమర్ వద్దకు వచ్చి వేడుకుంది. ఎవరికైనా ఇలాంటి అవసరం వస్తుందని దయతలచి ఆమెకు డబ్బులిచ్చారు. అసలు కథ రెండురోజుల తరువాత మొదలైంది. ఈవ్యవహారం కోవెలకుంట్ల పట్టణంలోని ఓ నెట్ సెం టరులో జరిగినట్లు బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన ప్రధాన రహదారిలో ఉన్న నెట్ సెంటరులోని ఓ బ్యాంకు కస్టమరు సర్వీసు వద్దకు ఓ మహిళ వచ్చి.. మా బంధువులు ఫోన్ పే చేస్తారు, మీ ఫోనుకు వచ్చినట్లు చెక్ చేసుకోండి, మీ కమీషన్ పట్టుకుని డబ్బులు ఇవ్వండి సార్.. నా కూతురికి ఆసుపత్రికి వెళ్లాలి.. అన్నది. అతను దయతలచి ఫోన్ పే చేస్తే ఇస్తాలేమ్మా అన్నాడు. వేరే ఫోను నుంచి ముప్పై వేలు ఫోన్ పే చేయించింది. ఆ బ్యాంకు సర్వీసు నెట్ సెంటరు కస్టమర్ ఫోన్‌పే చెక్ చేసుకుని కమిషన్ పట్టుకుని ఆమెకు డబ్బులు ఇచ్చాడు. అయితే రెండురోజుల తరువాత నెట్ సెంటరు కస్టమరు సర్వీస్ బ్యాంకు అకౌంటు లాక్ అయింది. ఆయనకు ఫోన్ పే చేసిన వ్యక్తి సైబర్ క్రైంలో పిర్యాదు చేయడమే దీనికి కారణమని తెలిసింది. ఆ ఇద్దరు కలిసే ఈ వ్యవహారం నడిపినట్లు తెలుస్తోంది.

'జీవో 117ని రద్దు చేయాలి'



చాగలమర్రిలో ఏపీయూఎస్ సభ్యత్వ నమోదు చేస్తున్న అధ్యక్షుడు సుధాకర్‌రావు

చాగలమర్రి, ఆగస్టు 21: రాష్ట్రంలో జీవో నెంబర్ 117ను తక్షణమే రద్దు చేసి ప్రాథమిక విద్యను మెరుగుపరచాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఆర్.శ్రీపతి డిమాండ్ చేశారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని ఆయా పాఠశాలలో ఏపీయూఎస్ సభ్యత్వ నమోదు ఉపాధ్యాయులచే నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాల గ్రాంట్ మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలు, పెండింగ్ బకాయిలు మంజూరు చేయాలని కోరారు. 2008 డీఎస్సీ వారిని రెగ్యులర్ చేయాలని, ఐఆర్ ప్రకటించి సీపీఎస్ వారికి డీఏ బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని కోరారు. ఎయిడెడ్, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని అన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీయూఎస్ ఉయ్యాలవాడ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, విప్రనారాయణచారి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 117ని ప్రభుత్వం రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ స్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కొలిమిగుండ్ల, బెలుం తదితర గ్రామాల పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆక్టోబరు 6, 7, 8 తేదీల్లో జరిగే ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామకిష్టారెడ్డి, ఉపాధ్యాయులు రమేష్, పుల్లయ్య, జ్యోతి నాగమణి, దిల్షాద్‌బేగం పాల్గొన్నారు.

పోలీసుల వినూత్న ప్రయత్నం

ప్రమాదాల నివారణలకు స్పెషల్ డ్రైవ్



ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పిస్తున్న సీఐ

డోన్(రూరల్), ఆగస్టు 21: డోన్ పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నియంత్రణకు పట్టణ పోలీసులు వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బందితో కలిసి పట్టణంలో ప్రధాన రోడ్లలో ట్రిపుల్ రైడింగ్ వెళ్లే వాహనదారులను, మద్యం సేవించి డ్రైవింగ్ చేసేవారిని, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించేవారిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ప్రొజెక్టర్ ద్వారా నిబంధనలు అతిక్రమించే వారి వల్ల కలిగే అనర్థాలు, ప్రమాదాలపై వీడియో ప్రదర్శనలు వేసి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

వైసీపీ నేత కుచ్చుటోపీ

● భూములు ఇప్పిస్తామంటూ రూ.10లక్షలకు పైగా వసూలు
● న్యాయం చేయాలని బాధితుల ఫిర్యాదు

కొలిమిగుండ్ల, ఆగస్టు 21 : గత ఐదేళ్ల వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ నేతలు చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటికి పొక్కుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధితులు బయటికి వచ్చి న్యాయం చేయాలని కోరుతున్నారు. తాజాగా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దస్తగిరి చేసిన అక్రమాలు వెలుగుచూశాయి. ఎన్నికల ముందు కనకాద్రిపల్లె గ్రామంలో బంజరు భూములు ఇప్పిస్తామంటూ నమ్మబలికి డబ్బులు తీసుకున్నట్లు పేద, బలహీన వర్గాల మహిళలు వాపోతున్నారు. గ్రామానికి చెందిన సుమారు 100మంది నుండి రూ.10 లక్షలకు పైగా సొమ్ము వసూలు చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. భూములు వస్తాయన్న ఆశతో తాము కష్టపడి దాచుకున్న సొమ్ముతో పాటు, అప్పుచేసి మరీ డబ్బులు ఇచ్చామని మహిళలు గుర్రమ్మ, నాగమ్మ, వడ్డె లక్ష్మీదేవి, పుల్లమ్మ, నాగచిన్నమ్మ, మహేశ్వరి, రజనీ, గౌరమ్మ తదితరులు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ వీరు కొలిమిగుండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ఆందోళన చేస్తున్న బాధిత మహిళలు

పౌర సరఫరాల గిడ్డంగి తనిఖీ



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

ఆళ్లగడ్డ, ఆగస్టు 21: ఆళ్లగడ్డ పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న పౌరసరఫరాల గిడ్డంగిని బుధవారం జేసీ విష్ణుచరణ్ తనిఖీ చేశారు. స్టాకును, రికార్డులను, గిడ్డంగి నుంచి సరఫరా అయ్యే బియ్యం తుకాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆళ్లగడ్డ తహసీల్దార్ కార్యాలయాన్ని చేరుకొని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రత్నకుమారి, సీఎస్‌డీటీ సోమశేఖరరెడ్డి, ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.

పంట నమోదు చేసుకోవాలి: ఏవో

కొలిమిగుండ్ల, ఆగస్టు 21: మండలంలోని గ్రామాలలో పంటలు సాగు చేసి ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు పంట నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె వెంట వీఏఏలు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి: సీఐ

బేతంచెర్ల, ఆగస్టు 21: పట్టణంలోని వాహనదారులు, ఆటో డ్రైవర్లు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం బేతంచెర్ల ఎస్ఐ అశోక్, పోలీసు సిబ్బంది, నంద్యాల ఆర్మ్ రిజర్వు సిబ్బందితో కలిసి నంద్యాల రోడ్డు టర్నింగ్ నుంచి రైల్వేస్టేషన్ వరకు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పట్టణంలో ట్రాఫిక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

చాగలమర్రి తహసీల్దార్‌గా రవికుమార్

చాగలమర్రి, ఆగస్టు 21: చాగలమర్రి తహసీల్దార్‌గా రవికుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. బండిఆత్మకూరు మండల తహసీల్దార్‌గా పని చేస్తూ ఎన్నికల సమయంలో కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం చాగలమర్రి తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. డీటీ విజయ్‌కుమార్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

నాటుసారా బట్టీల ధ్వంసం

బేతంచెర్ల, ఆగస్టు 21: మండలంలోని ముద్దవరం గ్రామ సమీపంలో కంప చెట్లలో ముద్దవరం గ్రామానికి చెందిన బోయ మీనుగ పాండురంగడు బుధవారం నాటుసారా బట్టి నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు ఎస్ఐ అశోక్ సిబ్బందితో కలిసి దాడి చేసి నాటుసారా బట్టిని, 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సారా విక్రేత పాండురంగడును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రత్యేక అధికారుల నియామకం

కోవెలకుంట్ల, ఆగస్టు 21: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీవో సయ్యదున్నీసా తెలిపారు. బుధవారం ఆమె విలేఖరలుతో మాట్లాడుతూ ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి నివేదిక తయారు చేసి పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసి పంపించారన్నారు. అందులో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.

'టీడీపీతోనే పేదల సంక్షేమం'

చాగలమర్రి, ఆగస్టు 21: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకుడు జెట్టి నాగరాజు తెలిపారు. బుధవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో లక్ష్మీదుర్గ పొదుపు సంఘం ఆధ్వర్యంలో నూతన ఏజెన్సీ ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యా కమిటీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. హెచ్ఎం కోటయ్య, టీడీపీ నాయకులు జెట్టి సురేష్, పద్మావతి, సాయి, నరసింహులు, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగు నివారణపై అవగాహన

దొర్నిపాడు, ఆగస్టు 21: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారిణి సనీత ఆధ్వర్యంలో గులాబీ రంగు పురుగు నివారణపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఆర్సీ ఏడీఏ సరళమ్మ, ఆర్ఏఆర్ఎస్ నంద్యాల శాస్త్రవేత్త శివరామకృష్ణ, కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించడానికి పీబీ నాట్ పత్తి అనే జపాన్ వారి కొత్త ఆవిష్కరణ ద్వార పంట సంపర్క ప్రక్రియకు అంతరాయం కలిగించడం వల్ల పత్తిలో గులాబీ రంగును అరికట్టవచ్చని అన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుప్రజ, జయరాణి, సురేంద్ర తదితరులు ఉన్నారు.

భారీ వర్షానికి నీట మునిగిన పంటలు

ప్యాపిలి, ఆగస్టు 21: మండలంలో మంగళవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. కలచట్ల, ఎర్రగుంట్లపల్లి, రంగాపురం, నల్లవల్లి తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. రూ.లక్షల నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వాగులు వంకలు పొంగిపొర్లాయి. ఎండుతున్న పైర్లకి ఈ వర్షం ఊపిరి పోసినా, లోతట్టు పొలాలులోని పంటలు టమోట, కంది, సజ్జ పంటలు నీట మునిగిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

'ఎయిడ్స్ అంటువ్యాధి కాదు'

సంజామల, ఆగస్టు 21: ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని చైల్డ్ ఫండ్ ఇండియా సూపర్‌వైజర్ మీరాం రెడ్డి అన్నారు. బుధవారం కానాల జడ్పీ ఉన్నత పాఠశా లలో చైల్డ్ ఫండ్ ఇండియా వర్కర్ టీమ్ సభ్యులు ఎయిడ్స్ వ్యాధిపై అవగా హన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ కుమారి, సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులు సీజ్

రుద్రవరం, ఆగస్టు 21: మండలలోని చిన్నకంబలూరు గ్రామంలో శ్రీలక్ష్మి నరసింహస్వామి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్ షాపును బుధవారం ఏవో శ్రీకృష్ణ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అనుమతి పత్రాలు లేనందున రూ.1,20,930 విలువ చేసే మందులు అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. రసాయనిక ఎరువులు అధిక ధరలకు అమ్మినా, కృతిమ కొరత సృష్టించినా షాపు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, వీఏఏ చాణక్యుడు పాల్గొన్నారు.

మట్కా ఆడితే గ్రామ బహిష్కరణ

ప్యాపిలి, ఆగస్టు 21: మట్కా ఆడితే గ్రామ బహిష్కరణ తప్పదని సీఐ వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. బుధవారం పోలీసు సర్కిల్ కార్యాలయంలో మట్కా బీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మట్కాతో ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు.

'గ్రామాభివృద్ధికి కృషి చేయాలి'

చాగలమర్రి, ఆగస్టు 21: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో మహబూబ్‌దౌల సూచించారు. బుధవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. 23న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాదు, తహసీల్దార్ రవికుమార్, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఏపీవో నిర్మల, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, పశువైద్యాధికారి సాయిబాబా పాల్గొన్నారు.

'క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలుపుతాం'



కరాటేలో ప్రతిభ చూపిన వారితో బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఆగస్టు 21: బనగానపల్లె నియోజవర్గంలోని క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేస్తామని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో కరాటేలో జాతీయ కరాటే పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి ఆరు మెడల్స్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందులో బనగానపల్లె మండలం హుసేనాపురానికి చెందిన దివ్య, చైతన్యరెడ్డి, అభినందించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు కళ్యాణ్‌బాబు, కరాటే బాషా, హరీష్, ప్రసాద్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. ముగ్గురికి తీవ్ర గాయాలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 21: మండలంలోని జి.జంబులదిన్నె నుంచి చాగలమర్రి మండలం నేలంపాడు గ్రామానికి వెళ్తున్న ఆటోను అదే మార్గంలో తిరుపతికి వెళ్తున్న కారు వెనుక నుంచి బుధవారం చింతకొమ్మదిన్నె గ్రామం వద్ద ఢీకొట్టింది. దీంతో ఆటో ప్రక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. ఆటో నడుపుతున్న నరసింహుడు, అతని భార్య రమదేవి, కొడుకు నవదీప్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వీరందరిని మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద సమయంలో ఆటోలో నలుగురు ప్రయాణిస్తున్నారు. రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ ఘటనా స్థలాన్ని చేరుకొని ప్రమాద వివరాలను తెలుసుకొని కారు డ్రైవరుపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

రుద్రవరం, ఆగస్టు 21: మండలంలోని నరసాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం కోతులు తెచ్చిన తంటా ఘర్షణకు దారి తీసింది. ఒకరి పంటపొలం నుంచి ఒకరి పంటపొలాల్లోకి కోతులు తోలారని మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఘర్షణలో చిన్నరాముడు, రమేశ్ అనే వ్యక్తులు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డకు తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ వర ప్రసాద్ మాట్లాడుతూ కోతుల విషయమై ఘర్షణ జరిగిందని తెలిపారు.

వ్యక్తిపై దాడి

కొలిమిగుండ్ల, ఆగస్టు 21: మండలంలోని బెలుంశింగవరం గ్రామానికి చెందిన మునగాల పెద్ద హుసేని అనే వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండ గా ఇద్దరు వ్యక్తులు అడ్డగించి దాడి చేసినట్లు ఏఎస్ఐ గోవిందనాయక్ తెలిపారు. పెద్ద హుసేని కొలిమిగుండ్ల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఆదే గ్రామానికి చెందిన పక్కీరా, వెంకటహుసేని పాత కక్షలతో దాడి చేశారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రూరల్ సీఐని కలిసిన టీడీపీ నాయకులు

డోన్(రూరల్), ఆగస్టు 21: మండలంలోని దేవరబండ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రూరల్ సీఐ సీఎం రాకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వెంకటనారాయణ గౌడు పాల్గొన్నారు.

'ఉద్యాన పంటలతో అధిక లాభాలు'

ఉయ్యాలవాడ, ఆగస్టు 21: ఉద్యానవన పంటలతో అధిక లాబాలు పొందవచ్చని కోవెలకుంట్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి ధరణి తెలి పారు. ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు గ్రామాల్లో బుధవారం మిరప, మామిడి పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ఉద్యానశాఖ అధికారులు సూచనలు సలహాలు పాటించాలన్నారు. ఉద్యా పంటలకు ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సరళ, జగన్‌మోహన్, రైతులు ఉన్నారు.